ప్రియుణ్ణి కఠోర హృదయుడిగా
చేయగలిగిన ఒక స్త్రీ జీవితఖండం

# వెలుగుల్లో నీడలు

• వింజమూరి వెంకటసుబ్బారావు •

"నేను నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను. నీకూ ఎవరూ లేరు; నాకూ లేరు. మనిద్దరం ఏ మాతే ఎవరిక్కావాలి?-నన్ననుగ్రహించవూ?-"

"పిచ్చిదానా! నాది రాతిగుండై పోయింది. కష్టాలతో నా హృదయం గాయాలపడి మళ్లీ యిప్పుడే మానుదల ఉదయిస్తోంది. ఆరేళ్ళనుంచి మన స్థిమితం లేక యిప్పుడే మరల్చుకుంటున్నాను. ఈస్థితిలో నాకు ప్రేమేమిటి? పెళ్లేమిటి?"

"నీ ముఖం చూస్తూంటే నాలో నాకే యేదో తెలియని మార్పొస్తోంది. నీకూనాకూ యేమంత ఏళ్లు మించి పోయాయ్?.......నీ స్థితేమిటి? బీదరికమా? ఇదే నిశ్చింతగా ఉంటుంది. ధనికులను చూడు ఎన్ని కష్టాలో........"

"నా మనస్సు పాడుచెయ్యకు. రెండురోజు లుండిపోతాను. నన్నెందుకు బాధిస్తావ్? మన స్థిమితంకోసం ఇలా తీర్థయాత్రలు చేస్తున్నా."

"నా హృదయాన్ని అర్పిస్తున్నాను. నిన్ను వదలలేను. కాదనకు. నేనూ పూర్వం ధనవంతురాల్నే. కాలకర్మ వశాత్తూ స్వబుద్ధిచేత ఈ విధంగా మారాను. నన్ననుగ్రహించవూ?—"

"క్షమించు, నా భార్య నన్నెప్పుడు వదలిందో అప్పణ్ణుంచీ మళ్ళా ఎవ్వళ్ళనీ కన్నెత్తి చూట్టం లేదు. నన్నెందుకు బాధిస్తావ్?"

"ఇంతేనా?"

"క్షమించు, ఇంతే."

"ఔను: నిన్ననాల్సిన పనేముంది? నా కర్మ. బుద్ధిపూర్వకంగా చేసుకున్నందు కనుభవిస్తున్నా. కట్టుకున్న మొగుణ్ణి వదిలాను. చేపట్టినవాడి చేత నిరాకరణ పొందాను. మనసు చెదరి ఇలా బికారినయ్యా. నా భర్తలో నున్న పోలికలు నీలో ఉన్నాయ్. నిజంగా నిన్ను చూస్తూంటే శరీరం గగుర్పొడుస్తూంది."

"నీ భర్త పేరేమిటి?"

"శివరాం. కలకత్తాలో గుమాస్తాగా బట్టల కొట్టులో ఉండేవాడు. నిష్కల్మషంగా, నిరాడంబరంగా యుండేవాడు. నన్ను లోకంలో అన్నిటికన్నా ఎక్కువగా ప్రేమించేవాడు. అలాంటి వాణ్ణి విడచి ద్రోహం చేశాను. ఏమయ్యాడో పాపం!..."

"అలాగా! ఐతే నీ పేరు దుర్గ కదూ?"

"అవును. నీ కెలా తెల్సు?నన్నెరుగుదువా?"

"నిన్నా....?.........నిన్నా........?"

"అలా తడబడుతున్నావేం? నన్ననుగ్రహించవూ?"

"ఒద్దు బాబూ! ఒద్దు. నిన్ను ప్రేమించి పెళ్లాడితే నాకు బుద్ధి చెప్పావుకదూ?—మళ్లీ నిన్నే?.... గ్రహించటం! అంత బుద్ధి తక్కువ పని ఎప్పుడూ చెయ్యను. పోయేదాని వెలాగూ పోతున్నావ్. నాశాంతిని విచ్ఛిన్నం చెయ్యకు. నా దారిని నన్ను పోనియ్యి."

"శివరాం! నా తప్పులు క్షమించవూ!........ క్షమించవూ?........"

"వదులు, వదులు! ఈ రాతిగుండె యింక కరుగదు. నన్ను పోనియ్. ఊఁ!!"

... ... ...

శివరాం దుర్గచేతుల్ని విదలించుకుని కాలిబాటంటే పరిగెత్తుకుంటూ ఎక్కడకో శూన్యంలోకి వెళ్లిపోయాడు.

దుర్గ తన బరువైన పశ్చాత్తప్త హృదయంతో నీరెండినకళ్ళతో చీకటిలోకి రెప్పవాల్చకుండా చూస్తూ కొయ్య బారిపోయింది!!!